



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 328 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 18-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం

**కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి**


**దాడిలో 400 మంది మృత్యువాత**

- మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం
- దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం




**కాబూల్,**
అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు.

-మిగతా 2 లో







### యుద్ధంలో మాకు ఎవరి సాయం అక్కర్లేదు'..

- అమెరికా చాలా శక్తివంతమైన దేశం
- హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం
- నాటో దేశాలకు తేల్చి చెప్పిన ట్రంప్..!

**వాషింగ్టన్**
హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్

-మిగతా 2 లో


# సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

**సీఎం సంతకానికే దిక్కులేకపోతే ఎలా**

- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది నిజం కాదా
- గత గవర్నర్ ప్రసంగాలకు..నేటికి ఏం తేడా
- గవర్నర్ ప్రసంగంలోనే తప్పులు దొర్లితే ఎలా
- ఐటి సెక్రటరీ ఎవరో వారిని తొలగించండి
- ఢిల్లీకి వెళ్లి నిధులు తేకుండా..నిధులు ఇచ్చి వస్తున్నారు
- కాంగ్రెస్ గ్యారెంటీలకు..ప్రభుత్వానికి జీరో వాల్యూ
- ధన్యవాద తీర్మానంపై ఎందుకు ధన్యవాదాలు తెలపాలి
- తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ విసుర్లు

**హైదరాబాద్,**
తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం నడిచింది. చర్చలో కెటిఆర్ మాట్లాడుతుండగా పలు సందర్భాల్లో మంత్రులు ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఈ క్రమంలో నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకు పోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది.

-మిగతా 2 లో



**420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుంది**





### అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం

- సీఎం రేవంత్‌ను తీసుకు వస్తా
- కేసీఆర్‌ను మీరు తీసుకు రావాలి
- మండలిలో మహేశ్ గౌడ్ ఆవేశపూరిత ప్రసంగం

**హైదరాబాద్,**
అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం..అందుకు మీరు సిద్ధమేనా అంటూ శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసు సిగ్గు చేటని, బిఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని

-మిగతా 2 లో



### కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

- అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి
- పాక్ తీరును తీవ్రంగా తప్పపట్టిన భారత్

**న్యూఢిల్లీ,**
అఫ్గానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. పాక్ ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతి భద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దుల ఆవల ఇలాంటి తీవ్రమైన

-మిగతా 2 లో

### ఆ తీయటి గొంతుకలు ..హనీ ట్రాప్

- మోసపోయారో గుల్ల అవుతారు జాగ్రత్త
- అమ్మాయిల పేరుతో సైబర్ మోసాలు
- ప్రజలను హెచ్చరించిన కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్,**
మారుతున్న పరిస్థితుల రీత్యా ఒంటరితనానికి అలవాటు పడే యువతను లక్ష్యంగా చేసుకొని సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలపై ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు హైదరాబాద్ నగర పోలీసులు. ఇందులో భాగంగా 'ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం.. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా

-మిగతా 2 లో

### అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారమే లక్ష్యం..

- కాల్పుల విరమణ లేదు..
- మొజ్తాబా ఖమేనీ స్పష్టం



**న్యూఢిల్లీ,**
తమ దేశంపై దాడి చేసిన అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యం అని ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేని స్పష్టం చేసినట్లు సమాచారం. ఖమేనికి సంబంధించిన వివరాలేవీ తెలియనప్పటికీ.. ఆయన మాత్రం ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రతీకారంతోనే ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్‌లపై ప్రస్తుత యుద్ధ సమయంలో అనుసరించాల్సిన విధానంపై జరిగిన ఒక విధానపరమైన సమీక్షా సమావేశం సందర్భంగా ఖమేని ఈ మాటలు చెప్పినట్లు ఇరాన్ అధికార వర్గాలు తెలిపాయి.అయితే, ఈ సమావేశానికి ఖమేని నేరుగా హాజరయ్యారా, లేదా అనే

-మిగతా 2 లో

# 'నీలగిరి ఎక్స్‌ప్రెస్' కథనానికిస్పందించిన ప్రభుత్వం...

**కాలుష్య నియంత్రణకు అత్యవసర చర్యలు ప్రారంభం**

**హైదరాబాద్,మార్చ్ 17 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న గాలి కాలుష్యంపై నిన్న నీలగిరి ఎక్స్‌ప్రెస్ పత్రికలో ప్రచురితమైన ప్రధాన కథనం రాష్ట్ర ప్రభుత్వాన్ని కదిలించింది. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న కాలుష్య సమస్యను ప్రాముఖ్యంగా ప్రస్తావించిన ఆ వార్తపై ప్రభుత్వం తక్షణమే స్పందిస్తూ పలు అత్యవసర చర్యలను ప్రారంభించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. నిన్నటి కథనంలో నగరంలోని వాహనాల పొగ, పరిశ్రమల నుంచి వెలువడుతున్న ఉద్గారాలు, నిర్మాణ పనుల వల్ల పెరుగుతున్న ధూళి---ఇవన్నీ కలిసి గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయని వివరంగా వెల్లడించబడింది. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతుండటంతో ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో పర్యావరణ శాఖ, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కాలుష్య నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేస్తూ కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. పరిశ్రమలపై ప్రత్యేక తనిఖీలు ప్రారంభమయ్యాయి.

-మిగతా 2 లో






# అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం

మొదటి తరువాయి

తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. 'మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి. నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన ఒక నాయకుడు పట్టుబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రశ్నించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్యపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరారు. డ్రగ్స్ కేసుల్లో ఎంత పెద్దవారైనా వదిలే ప్రసక్తే లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీ-ఫారమ్ ఇచ్చే ముందు డ్రగ్స్ టెస్టులు చేయాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో నేరుగా పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీ నది పరిస్థితిపై కూడా స్పందిస్తూ.. అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి, దేశానికి సేవ చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమేనని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## యుద్ధంలో మాకు ఎవరి సాయం అక్కర్లేదు'..

మొదటి తరువాయి

పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

## కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

మొదటి తరువాయి

హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఎ÷-గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విపత్కర సమంలో ఆ దేశ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై సోమవారం రాత్రి పాక్ వైమానిక దాడులు చేపట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. దాడి కారణంగా భవనం పూర్తిగా ధ్వంసమైంది.

## అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారమే లక్ష్యం..


మొదటి తరువాయి

విషయంలో స్పష్టత లేదు. ఇరాన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యుద్ధం ముదురుతున్న వేళ.. రెండు దేశాలతో కాల్పుల విరమణ, ఉద్రిక్తతలు తగ్గించే అంశంపై ఇరాన్ నేతలు ఖమేనితో చర్చలు జరిపారు. ఉద్రిక్తతలు తగ్గించి, శాంతి, కాల్పుల ఒప్పందం వంటి అంశాల్లో రెండు దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన కొన్ని ప్రతిపాదనల్ని ఇరాన్ నేతలు ఆయన ముందుంచారు. కానీ, ఖమేని మాత్రం వాటిని తిరస్కరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లపై ప్రతీకారమే తమ లక్ష్యమని, తమ దేశ పౌరుల్ని చంపిన వారి నుంచి తగిన పరిహారం పొందాల్సిందే అని ఖమేని స్పష్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు పరిమిత స్థాయిలోనే ప్రతీకార చర్యలకు దిగామని, అనుకున్నది సాధించేవరకు తమ చర్యలు కొనసాగుతాయని, అంతవరకు ఇది తమ ప్రాధాన్యంగా ఉంటుందని అయన స్పష్టం చేశారు. ఇరాన్ ఎప్పటికీ వెనకడుగు వేయదని, ఎప్పటికీ ప్రతిఘటిస్తూనే ఉంటుందని ఖమేని అన్నారు. అయతొల్లా ఖమేని మరణానికే కాదని, ప్రతి ఇరాన్ పౌరుడి మరణానికి పూర్తి శక్తి సామర్థ్యాలతో ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. అయితే, ప్రస్తుతం ఖమేని ఎక్కడ ఉన్నారనేదానిపై స్పష్టత లేదు. ఆయన రష్యాలోని మాస్కోలో చికిత్స తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

# అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం

మొదటి తరువాయి

పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియాలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని ఆఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందని



పేర్కొన్నారు. దాడుల్లో 400 మంది వరకు మరణించారని.. సుమారు 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఎ÷-గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ఆఎ÷-గానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది అఎ÷-గాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు. కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని ఆఎ÷-గానిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పౌరులకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండానే జాగ్రత్త పడుతూనే దాడులు చేశామని స్పష్టం చేసింది.

# సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

మొదటి తరువాయి

ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది?తొలి క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైందన్నారు. సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారని, మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టాలో చెప్పాలన్నారు.కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుందని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీర వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకంటున్నాడని.. ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకునివచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్దాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు. ఇకపోతే 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా?ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి? బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు జీవో చూపించండి. ఇక్కడే రాజీనామా చేసి నేను వెళ్లిపోతాను' అంటూ సవాల్ విసిరారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దంటూ డిప్యూటీ సీఎంకు సూచించారు. భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అబద్ధమని.. రాష్ట్రంలోని మహిళలంతా చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నది తప్పు మాట అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని సినిమా చూపించిందే కాంగ్రెస్ అని.. సోనియా గాంధీని బలిదేవత అని తాము అనలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఆ తీయటి గొంతుకలు ..హనీ ట్రాప్

మొదటి తరువాయి

మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు అంటూ యువతను ఆకర్షించే రీతిలో సోషల్ మీడియాలో వస్తోన్న యాడ్స్‌పై ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. అయితే, దీని వెనుక ఉన్నది తీయని మాటలు కాదు.. నిలువునా దోపిడీ చేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు అని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు పన్నుతున్న హనీట్రాప్ ఇది. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదు. అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలే. మాయమాటలకు బుట్టలో పడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చుకున్నట్లే. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయి. ఇక రాత్రిపూట సరదాగా మాట్లాడదామని వీడియో కాల్ చేశారో.. ఇక అంతే. అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారు. ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ సెక్స్‌టార్షన్‌కు దిగుతారు. దీంతో పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయం అన్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు అవ్వరు.. ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువును దెబ్బతీసే భారీ కుట్ర దాగి ఉందని తెలుసుకోండి. క్షణికావేశంలో గుర్తు తెలియని ఫేక్ డేటింగ్, వీడియో కాలింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకొని మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు. రాత్రి వేళల్లోనే ఈ తరహా యాడ్స్ దర్శనమిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండండి. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా ఈ తరహా సైబర్ వలలో చిక్కుకుంటే.. పరువు పోతుందేమోనని భయపడొద్దు. తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి. లేదా వెబ్‌సైట్‌లోనైనా ఫిర్యాదు చేయండి. బీ అలర్ట్' అని సజ్జనార్ సూచించారు.

# 'నీలగిరి ఎక్స్‌ప్రెస్' కథనానికిస్పందించిన ప్రభుత్వం...

మొదటి తరువాయి





కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించని ఫ్యాక్టరీలను గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే తనిఖీలు నిర్వహించి ఉల్లంఘనలు గుర్తించిన యూనిట్లపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై మూసివేత చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఇక వాహనాల కాలుష్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. పొల్యూషన్ సర్టిఫికెట్ లేని వాహనాలపై నగర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాత వాహనాలను తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రజలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగించుకోవాలని, అవసరమైతే కార్‌పూలింగ్ చేయాలని సూచించారు.
నిర్మాణ రంగంలో పెరుగుతున్న ధూళిని నియంత్రించేందుకు కొత్త మార్గదర్శకాలు జారీ చేశారు. నిర్మాణ ప్రదేశాల్లో నీటిని చల్లడం, కవర్లు ఏర్పాటు చేయడం తప్పనిసరి చేశారు. ఈ నిబంధనలు పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో నగరంలో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను ప్రకటించింది. రహదారుల వెంట మొక్కలు నాటడం, ఖాళీ ప్రదేశాలను గ్రీన్ జోన్లుగా అభివృద్ధి చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. గాలి నాణ్యతను పర్యవేక్షించేందుకు మరిన్ని ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.వైద్య నిపుణులు కూడా ప్రజలకు జాగ్రత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు ధరించాలని, అనవసరంగా బయట తిరగకుండా ఉండాలని సూచించారు. నిన్నటి నీలగిరి ఎక్స్‌ప్రెస్ కథనం ప్రభావంతో ప్రభుత్వం వేగంగా స్పందించడం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ చర్యలు కేవలం తాత్కాలికంగా కాకుండా దీర్ఘకాలికంగా కొనసాగాలని, కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ప్రజలు తోడ్పడితేనే హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చడం సాధ్యమని వారు తెలిపారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
www.neelagiriexpress.in
17 Mar 2026 - Page 2

విషపూరిత పొగ గాలిలో కలసి ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారిపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ నిపుణులు చెబుతున్నదాని ప్రకారం ప్రభుత్వం వెంటనే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలి. కాలుష్యాన్ని సృష్టించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల ఉద్గారాలపై కట్టడి చేయాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. అలాగే నగరంలో చెత్త దహనాన్ని పూర్తిగా నిషేధించి చెత్త నిర్వహణను శాస్త్రీయంగా నిర్వహించాలి. నగరంలో మరిన్ని గ్రీన్ జోన్లు, పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా గాలి నాణ్యతను మెరుగుపరచవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ అభివృద్ధి ఎంత వేగంగా జరుగుతుందో, అదే స్థాయిలో పర్యావరణ పరిరక్షణపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సంస్కృతి సాహిత్యా సాంప్రదాయాని కాపాడడం కవుల బాధ్యత- నిరంజన్ రెడ్డి






**వనపర్తి మార్చి 17 (నీలగిరి ఎక్స ప్రెస్ ):** సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించి స్ఫూర్తి నింపాల్సిన బాధ్యత కవులపై ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఉగాది పండుగ సందర్భంగా సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో నిర్వహించిన “పరాభవ నామ ఉగాది కవి సమ్మేళనం” కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన స్ఫూర్తివంతమైన సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన నిరంజన్ రెడ్డి, నవతరం కవులు వినిపించిన కవితలను ఆసక్తిగా ఆలకించి వారిని సన్మానించి అభినందించారు. తన ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ --- యుగానికి నాంది పలికే ఉగాది పండుగ ప్రజలజీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు నింపాలని



ఆకాంక్షించారు. పరాభవ నామ సంవత్సరంలో ప్రజలకు విజయాలు కలగాలని కోరారు. సాహిత్యంలో గాంభీర్యం, పట్టు ఉన్న కవితలు ప్రశంసనీయం కాగా, సాధారణ ప్రజలకు అర్థమయ్యే సరళమైన భాషలో కవిత్వం చెప్పడం గొప్ప నైపుణ్యమని తెలిపారు. భాషాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం నవతరం కవుల ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. పండుగలు, జాతరలు ప్రజల జీవనశైలిని ప్రతిబింబిస్తాయని, వ్యవసాయ పనుల ఆరంభానికి ఉగాది శుభసూచకమని చెప్పారు. వ్యవసాయాన్ని యజ్ఞంలా భావించే విధంగా కవిత్వం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇప్పటి సమాజంలో మనిషి ఏకాకిగా మారడం ఐక్యతకు ప్రమాదమని, మేధావులు, కవులు ప్రజల్లో అనుబంధాలు పెంచేలా, ప్రపంచ శాంతి నెలకొనేలా తమ రచనల ద్వారా ప్రభావితం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, హేమంత్ కుమార్, మంద రాము, చిట్యాల రాము, ముద్దుసార్ తదితర కవులు పాల్గొన్నారు. సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, నారాయణ రెడ్డి, డాక్టర్ వీరయ్య, ఖాజా మైనుద్దీన్, బైరోజు చంద్రశేఖర్ పలువురు సాహితీవేత్తలు హాజరయ్యారు.

# రాష్ట్రంలోని విద్యారంగానికి కనీసం 15% బడ్జెట్ కేటాయించాలి.

-విద్యారంగం సమస్యలపై వెంటనే రాష్ట్రం స్పందించాలి..
-విద్యార్థుల 9,0కోట్ల స్కాలర్షిప్‌డఫిజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.
-ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్.




**దేవరకొండ మార్చి 17. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతు విద్యార్థుల సమస్యలపై ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రాబోయే మార్చి 20న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు.

రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కావడం వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న అన్ని స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్లను విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# జాతీయ రహదారి--563 పనులు వేగవంతం చేయాలి



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 563 నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో భారత జాతీయ రహదారి సంస్థ వరంగల్ ప్రాజెక్ట్ సంచాలకుడు భరద్వాజ్, ఆర్డీవో మహేశ్వర్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడి భరద్వాజ్ మాట్లాడుతూ, వరంగల్--కరీంనగర్ మార్గంలో 89 శాతం పనులు పూర్తయ్యాయి. జూలై 31లోగా నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యం అని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ, భూసేకరణ, ఇతర పెండింగ్ సమస్యలను రెవెన్యూ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ సమన్వయంతో త్వరగా పరిష్కరించాలి. దాదాపు 90 శాతం పనులు పూర్తయినందున మిగిలిన పనుల్లో వేగం పెంచాలి అని సూచించారు. చిగురుమామిడి--హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనుల పురోగతిపై కూడా కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీ, రోడ్లు--భవనాల శాఖ, విద్యుత్ అధికారులు కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి భూసేకరణ, ఎలక్ట్రిక్ స్తంభాల తొలగింపు, పునర్నిర్మాణం వంటి అంశాలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి. ఈ రహదారి పనులపై ప్రతివారం సమీక్ష చేస్తాను అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రోడ్లు--భవనాల శాఖ ఈఈ నరసింహాచారి, డి.ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

# పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శిక్షణలో పాల్గొన్న తల్లోజు ఆచారి



**నాగర్‌కర్నూల్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలో నిర్వహించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్ 2026 కార్యక్రమంలో భాగంగా బిజినపల్లి, తిమ్మాజిపేట మండలాల శిక్షణ తరగతుల్లో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “సంస్థ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ప్రజలతో సన్నిహిత సంబంధాలు -- ఇవన్నీ బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశం” అని పేర్కొన్నారు. భవిష్యత్తు రాజకీయ, సామాజిక సవాళ్లను ఎదుర్కొనేలా కార్యకర్తలను తీర్చిదిద్దుతూ సమర్థవంతమైన నాయకత్వాన్ని రూపొందించేందుకు ఈ శిక్షణ వేదికగా నిలుస్తుందని అన్నారు. అదేవిధంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనల్లోని అంత్యోదయ సూత్రంను గుర్తుచేస్తూ, సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. “సంస్థ పట్ల అంకితభావం, క్రమశిక్షణ, నియమ నిబంధనలతో పని చేయడం ద్వారా మాత్రమే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది” అని ఆయన దిశానిర్దేశం చేశారు.


# మేడిపల్లి సీఐగా చింత శంకరయ్య




**మేడ్చల్--మల్కాజిగిరి, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు కొత్త సీఐగా చింత శంకరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు అల్వాల్ ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన ఆయనను పై అధికారులు మేడిపల్లి సీఐగా నియమించారు. మునుపటి సీఐ ఆర్. గోవిందరెడ్డి బదిలీపై వెళ్లడంతో ఈ నియామకం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చింత శంకరయ్య మాట్లాడుతూ, “నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా శాంతి--భద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తాం. అందుకు ప్రజలు కూడా పూర్తిగా సహకరించాలి” అని పేర్కొన్నారు.

# ఎస్సీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు

-- మేడ్చల్ కలెక్టరేట్ ప్రకటన



**మేడ్చల్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎస్సీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మేడ్చల్ కలెక్టరేట్ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించింది. ఈ పథకం కింద రెండు చక్రాల వాహనాలపై 90 శాతం, మూడు చక్రాల వాహనాలపై 70 శాతం సబ్సిడీ అందించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆదాయ, కుల, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆన్లైన్‌లో tgobmms.cgg.gov.inవెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పథకాల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నిరసన



**పెద్దపల్లి, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పెద్దపల్లి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం జరిగింది. మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి హామీలు, ఇల్లు లేని పేదలకు ఇండ్లు, వితంతువులకు, వృద్ధులకు పెన్షన్లు, రైతులకు రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, రుణమాఫీ వంటి అంశాలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. అలాగే కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద రూ.1,00,116తో పాటు తులం బంగారం ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు నెలకు రూ.2500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం చొరవ తీసుకొని నిరుద్యోగులు, వితంతువులు, వృద్ధులు, మహిళలు, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల శాఖ తరఫున కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, దాడి సంతోష్, మేకల శ్రీనివాస్, వోల్లే తిరుపతి, కందుల సదయ్య, మామిడి ఉమేష్, శిరాలపు మహేష్, రెండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు



**పాలకుర్తి, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కేవికే రామగిరి ఖిల్లా శాస్త్రవేత్తల బృందం, పాలకుర్తి వ్యవసాయ శాఖ, జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మల్క రామస్వామి మాట్లాడుతూ, కోతుల బెడద కారణంగా రైతులు నష్టపోతున్నారని, ఆయిల్ పామ్ పంటలు వేసి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. శాస్త్రవేత్తలు, అధికారులు మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో పంటలు పండించడం వల్ల నేల ఆరోగ్యం, జీవవైవిధ్యం పెరుగుతుందని, విషరహిత ఆహారం సమాజానికి అందుతుందని వివరించారు. జీవామృతం, ఘన జీవామృతం వంటి ఆవు ఆధారిత ఉత్పత్తులను ఉపయోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమని తెలిపారు. మిశ్రమ పంటల ద్వారా ఒకే పొలంలో రకరకాల పంటలు వేసి పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని, భూమి సారం పెరిగి పర్యావరణహిత వ్యవసాయం సాధ్యమవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు బీ. శశిధర్, బండి ప్రమోద్ కుమార్, కేవికే శాస్త్రవేత్తలు డా. కిరణ్, భాస్కర్, జీడి నగర్ సర్పంచ్ సూర రమా, బీమ్లా నాయక్ తండా సర్పంచ్ ఇస్లావత్ అఖిల, తిరుమల ఆయిల్ పామ్ ఫీల్డ్ అసిస్టెంట్ టీ. ప్రశాంత్, అలాగే అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఎస్.హెచ్.ఓగా ట్రైనీ ఐపీఎస్ నియామకం

**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



2023 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐపీఎస్ అధికారి సోహం సునీల్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్.హెచ్.ఓగా నియమితులయ్యారు. శిక్షణలో భాగంగా ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించగా, మూడు నెలల పాటు క్షేత్రస్థాయిలో పోలీసు యంత్రాంగం పనితీరును అర్థం చేసుకోవడానికి సేవలందించనున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఈ శిక్షణ కొనసాగనుందని అధికారులు తెలిపారు.

## ప్రమాద బాధితులకు భరోసా...
# 'పీఎం రాహత్'తో కొత్త దిశ




దేశంలో వేగంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రతి రోజూ అనేక కుటుంబాలను దెబ్బతీస్తున్నాయి. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే సరైన వైద్య సహాయం అందక ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు సాధారణమైపోయాయి. ఈ నేపథ్యంలో ప్రమాద బాధితులకు తక్షణ చికిత్స అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం "పీఎం రాహత్" (Prime Minister Road Accident System -- Hospitalization and Assured Treatment) పథకాన్ని ప్రవేశపెట్టడం సమయోచిత నిర్ణయం. ప్రధాన మంత్రి చ్ఛితీవఅంతీఝ వీశీఱ ఆవిష్కరించిన ఈ పథకం రోడ్డు భద్రతా రంగంలో కీలక మలుపు తిప్పే సామర్థ్యాన్ని కలిగి ఉంది. భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద రహదారి నెట్వర్క్ కలిగిన దేశాల్లో ఒకటి. అయితే ప్రమాదాల నివారణలో మాత్రం ఇంకా వెనుకబడిన వాస్తవం బాధాకరం. ప్రమాదం జరిగిన వెంటనే సహాయం అందించడంలో ఆలస్యం, సహాయకులకు ఎదురయ్యే న్యాయ సమస్యలు, ప్రైవేటు ఆసుపత్రుల నిర్లక్ష్యం---ఇవి అన్నీ కలిసి బాధితుని ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా యువతే ప్రమాదాలకు గురవడం వల్ల కుటుంబాలు ఆర్థిక, సామాజికంగా కుదేలవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో 'గోల్డెన్ అవర్' ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం, ఆ కీలక సమయంలోనే వైద్య సేవలు అందేలా "పీఎం రాహత్" పథకాన్ని రూపొందించింది. ప్రమాదం జరిగిన గంటలోపే సరైన చికిత్స అందితే ప్రాణాలు రక్షించే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఈ దిశగా ముందడుగు వేయడం అభినందనీయం. పథకం ప్రకారం ప్రమాద బాధితుడు ఆసుపత్రిలో చేరే సమయంలో ఎలాంటి ముందస్తు చెల్లింపు అవసరం లేదు. కులం, మతం, ఆదాయం అనే భేదాలు లేకుండా అందరికీ సమాన వైద్య సహాయం అందించబడుతుంది. అత్యవసర సేవల కోసం 112 నంబర్ ద్వారా తక్షణ స్పందన కల్పించబడుతుంది. గోల్డెన్ అవర్ నుంచి వారం రోజుల వరకు సుమారు లక్షన్నర రూపాయల వరకు నగదు రహిత చికిత్స అందించడం ఈ పథకంలోని ప్రధాన ఆకర్షణ. అత్యవసర శస్త్రచికిత్సలు, ఐసీయూ సేవలు, డయాగ్నోస్టిక్ పరీక్షలు, ఔషధాలు---అన్నీ ఈ పథకం పరిధిలోకి వస్తాయి. వారం తరువాత కూడా "ఆయుష్మాన్ భారత్" పథకం కింద చికిత్స కొనసాగించే అవకాశం ఉండటం మరింత ఊరటనిస్తుంది. దీంతో బాధిత కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సాంకేతిక వ్యవస్థలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఎలక్ట్రానిక్ యాక్సిడెంట్ రిపోర్ట్, ట్రాన్సాక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్ వంటి పద్ధతులు పారదర్శకతకు దోహదం చేస్తాయి. అదేవిధంగా సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించేందుకు "రాహ్ వీర్" పథకం ద్వారా నగదు బహుమతులు ప్రకటించడం సమాజంలో మానవత్వాన్ని పెంపొందించే చర్యగా నిలుస్తుంది. అయితే, పథకం అమలులో కొన్ని సవాళ్లు కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల బిల్లుల విషయంలో అవకతవకలకు అవకాశం ఉండటం, నిధుల దుర్వినియోగం జరిగే ప్రమాదం ఉండటం ఆందోళన కలిగించే అంశాలు. పర్యవేక్షణ వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయకపోతే పథకం లక్ష్యాలు దెబ్బతినే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే "పీఎం రాహత్" పథకం ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడే దిశగా కీలకమైన అడుగు. అయితే రోడ్ల నాణ్యత మెరుగుదల, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల్లో అవగాహన పెంపు వంటి అంశాలు సమాంతరంగా అమలవ్వాలి. అప్పుడు మాత్రమే ప్రమాదాలు తగ్గి, ప్రాణ నష్టం నివారించే లక్ష్యం సార్థకమవుతుంది.

**వ్యాసకర్త**
**గోరుపాటి శంకర్**
**అసోసియేట్ ఎడిటర్ - నీలగిరి ఎక్స్ ప్రెస్**
**ఎం.ఎ తెలుగు ఉస్మానియా విశ్వవిద్యాలయం అండ్ ఎం.సి.జే.**



# మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి

### జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

**నల్లగొండ, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జివి రమేష్ మాట్లాడుతూ, "మహిళా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తాం" అని హామీ ఇచ్చారు. ఉద్యోగ బాధ్యతలను సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ పథకాలను, టీకాలను సకాలంలో మారుమూల గ్రామాల్లో ఉన్న పశువులకు అందించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఉచిత గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాలు అన్ని మండలాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగుల కోసం క్యారమ్స్, చెస్, మ్యూజికల్ చైర్ వంటి వినోదాత్మక క్రీడలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఆత్మీయంగా సత్కరించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ నాన్-గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. అజీముద్దీన్, కార్యదర్శి జానీ పాషా, అసోసియేట్ ప్రెసిడెంట్ సుజాత, ట్రెజరర్ నాగరాజు, సభ్యులు అనిత, లక్ష్మణరావు, సైదులు నాయక్, జీవన్, ఎల్లేష్, నవీన్, నిర్మల, శ్రావ్య, జ్యోతి, లత, రాధిక, శివ, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శ్యామయేల్ ఇంటి పై దాడికి బీజేపీ క్షమాపణ చెప్పాలి

**-ఎర్ర కృష్ణ జాంభవ్ .**



**దేవరకొండ మార్చి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలో స్థానిక కార్యాలయంలో,నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ మాట్లాడుతూ తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శ్యామయేల్ ఇంటి పై దాడికి బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సి సెల్ రాష్ట్ర చైర్మన్ గా పదవిబాధ్యతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కావాంపల్లి సత్యనారాయణ సభలో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శ్యామయేల్ మాట్లాడిన మాటలను అపార్థం, వక్రీకరణ చేసుకొని మనువాద పార్టీలు, నాయకులు వారి ఇంటిపై దాడి చేసి, అసభ్య పదజాలంతో దుశించిన వారి పై కఠిన చర్యలు తీసుకోని,వారికీ క్షమాపణలు తెలియజేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ, బీజేవైఎం నాయకుల దిష్టిబొమ్మను దహనం చేస్తామని సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి సంక్షేమ పథకాలు ఓర్వలేక రాష్ట్ర నాయకులపై లేనిపోని అబండాలు మోపుతూ సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో చేసినటువంటి ప్రజాప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక స్థానిక ఎమ్మెల్యేలు మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ ప్రభుత్వాన్ని బద్నామ్ చెయ్యాలని చూస్తున్న బిజెపి నాయకులకు అదేవిధంగా బీజేవైఎం నాయకులు రాబోయే రోజుల్లో ప్రజా ప్రభుత్వంలో కచ్చితంగా శిక్ష తప్పని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇట్టి చర్యలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు వారిపై క్రమశిక్షణ చైర్యలు తీసుకోని వారిని పార్టీ నుండి సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు.

# నీటి సమస్య పరిష్కారానికై చేతిపంపుల మరమ్మత్తులు



**హుస్నాబాద్ , మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కోహెడ మండలంలోని సముద్రాల గ్రామంలో గత రెండు మూడు సంవత్సరాలుగా ఖరాబైన చేతిపంపులను ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో నీటి కొరత లేకుండా చూడాలనే సంకల్పంతో గ్రామ సర్పంచ్ అట్లా శ్రీనివాస్ ముందడుగు వేశారు.గత నాలుగు రోజులుగా ఉపసర్పంచ్ చింతకింది సింగరయ్య, పాలకవర్గ సభ్యులు ఉప్పరపల్లి శ్రీనివాస్, దానవేణి లత, పూల పద్మ, పిల్లి సతీష్, గట్టు శ్రీనివాస్, వేముల విజయ, బైరి మానస, పిల్లి రజిని, కానిశెట్టి వీరన్న, శివరాత్రి ఎల్లం, వేల్పుల శ్రీనివాసు తదితరులతో కలిసి గ్రామంలో మొత్తం 11 చేతిపంపు బోర్లకు మరమ్మత్తులు చేపట్టారు.మిగిలిన మూడు నుంచి నాలుగు చేతిపంపులను కూడా త్వరలోనే సరిచేస్తామని సర్పంచ్ అట్లా శ్రీనివాస్ తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ఒకదాని తర్వాత ఒక పని చేపడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా బావుల మోటర్లు కాలిపోతే వాటిని కూడా వెంటనే మరమ్మత్తు చేసి గ్రామ ప్రజలకు ఎప్పటికప్పుడు నీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## శాతవాహన విశ్వవిద్యాలయ ఉర్దూ ఆచార్యునికి పేటెంట్ గౌరవం



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఉర్దూ విభాగానికి చెందిన సహాయ ఆచార్యుడు డా. నజిముద్దీన్ మునవర్ గారికి వర్నాకులర్ లాంగ్వేజ్ ట్రాన్స్లేషన్ డివైస్ పై పేటెంట్ లభించింది.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ గారు ఆయనను అభినందిస్తూ, ఇతర అధ్యాపకులు కూడా పరిశోధనలో ముందుకు రావాలని ప్రోత్సహించారు. డా. మునవర్ గారు ఇప్పటికే పలు పుస్తకాలు రచించడమే కాకుండా, అంతర్జాతీయ సెమినార్లు, జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం ఆయన బోర్డు ఆఫ్ స్టడీస్ ఉర్దూ చైర్మన్, చీఫ్ వార్డెన్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా కూడా సేవలందిస్తున్నారు.విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మావతి, ఉర్దూ విభాగాధిపతి డా. అబ్రారుల్ బాక్వి, ఇతర అధ్యాపకులు ఆయనను అభినందించారు.

# హిందూ సమ్మేళన కమిటీ ఏర్పాటు



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్‌లో హిందూ సమ్మేళనం నిర్వహించేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి శ్రీ యజ్ఞవరాహ స్వామి హిందూ సమ్మేళన సమితి అనే నామకరణం చేశారు.పుర ప్రముఖుడు చందా సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో చొల్లేటి రమేష్ అధ్యక్షుడిగా, గాబూట్ల పవన్ కుమార్ కార్యదర్శిగా, గంద్ర సత్యనారాయణ కోశాధికారిగా, మహిళా ప్రముఖురాలిగా బండపల్లి ఉదయను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా విభాగ్ సహవ్యవస్థాప్రముఖ్ దావులూరి మురళీధర్ మాట్లాడుతూ, హిందూ సమ్మేళన అవసరం, దాని ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చొల్లేటి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ కూనాడి రాంరెడ్డి, మండల కార్యవాహ మాదాసు విక్రమ్, మండల వ్యవస్థాప్రముఖ్ తాడెం ఐలయ్య, శాఖ కార్యవాహ ఎం. లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ 2026 ను ఆవిష్కరించిన అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్...



**మాసాబ్ ట్యాంక్, మార్చి 17(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ వార్షిక డైరీ 2026 ను ఎస్సిడిడి అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ ఆవిష్కరించారు. మంగళవారం కమీషనర్ కార్యాలయంలోని అడిషనల్ డైరెక్టర్ ఛాంబర్ లో డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ మాట్లాడుతూ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరీ ని రూపొందించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. డైరీ రూపకల్పన అంత ఆషామాషీ కాదని, భవిష్యత్తులో డైరీ కార్యచరణను ముందుగా చేపట్టాలని అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. సమగ్ర సమాచారంతో డైరీ రూపొందించడం అభినందనీయమన్నారు. జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సిడిడి స్టాఫ్ అందరికీ డైరీ ఉపయోగకరంగా ఉంటుందని, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ జరగటం పట్ల అసోసియేషన్ ను అభినందించారు. టిజి ఎస్సిడిడి ఎం ఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ చరిత్రలో డైరీ రూపొందించేందుకు యావత్ రాష్ట్రంలోని 33 జిల్లాల మినిస్టీరియల్ స్టాఫ్ పడిన శ్రమ అంతా ఇంతా కాదని, వారి సహకారం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. నాలుగు నెలల శ్రమ ఫలితంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ 2026 ను రూపొందించడం గర్వంగా ఉందని, ఈ క్రెడిట్ అంతా మినిస్టీరియల్ స్టాఫ్ కే దక్కుతుందని అన్నారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా రూపొందించిన డైరీ కి అడగగానే సందేశాలను పంపించి ప్రోత్సహించిన ముఖ్యమంత్రికి, ఎస్సీడిడి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు, సెక్రటరీ సభ్యసాచి ఘోష్ కు, అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్, ఎస్సీ కార్పొరేషన్ విసి అండ్ ఎండి హనుమంత్ నాయక్ తదితరులకు పేరుపేరునా రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో కమిషనర్ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ మరియు అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు పి.శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి, సీనియర్ సూపరింటెండెంట్ లు అలీం, జి.బాలస్వామి రెడ్డి, ఈ.రత్నాకర్, జి.సంజీవ, వేణుగోపాల్, సాయి ప్రసన్న, కొమరయ్య, హెచ్ ఓ డి కార్యాలయ సీనియర్ స్టాఫ్ కళ్యాణ్ రామానంద్, సచిన్, రజని, రజిత, మేఘమాల, అశోక్, ప్రవీణ్, చంటి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్‌ను పర్యవేక్షించండి

-విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్.

-సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ .




**దేవరకొండ మార్చి 17. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ప్రభుత్వ హాస్పిటల్ విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ,సిబ్బంది సరి అయినటువంటి సమయపాలన పాటించకపోవడం, సరైన మౌలిక సదుపాయాలు (ఎండాకాల సమయంలో తాగునీరు లేకపోవడం) డ్రెస్ కోడ్ పాటించకపోవడం, పేషెంట్లకు తగినట్టుగా వైద్యులు ఉన్నప్పటికీ వైద్యులు అందుబాటులో లేకపోవడం, డ్యూటీ డాక్టర్ కూడా సమయపాలన పాటించకపోవడం, వైద్య సిబ్బంది డాక్టర్లు, సూపర్డెంట్ డాక్టర్ రవి ప్రకాష్ కూడా దురుసుగా ప్రవర్తించడం వలన పేద ప్రజలకు సరైనటువంటి వైద్యం అందక ఇబ్బందులకు గురవుతున్నారు .రక్త పరీక్ష ,ఎక్రే కొన్ని రకాలైనటువంటి పరీక్షలు చేసేటటువంటి వ్యక్తులు పేషంట్ల దగ్గర దురుసుగా ప్రవర్తిస్తూ మా దగ్గర పరీక్షలు లేవు మేము చేయలేము బయట ప్రవేట్ హాస్పిటల్ లో చేయించుకోమని దురుసుగా మాట్లాడటం జరుగుతుంది.థైరాయిడ్ సంబంధించి పరీక్షలు చేయకపోవడం మందులు ఇవ్వకపోవడం ఇది కాక డెలివరీ సెక్షన్ లో నర్సులు ఆయాలు డబ్బులు వసూలు చేయడం ఎమర్జెన్సీ వార్డులలో కూడా పనిచేసేవారు డబ్బులు వసూలు చేయడం జరుగుతుంది . ఈ .ఎన్. టి.డాక్టర్ లేకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉంది.పేద ప్రజలకు సరైన వైద్యం అందించక ఇబ్బందులకు గురవుతున్నారు. హాస్పిటల్ ఒక మాయగా తయారయింది. ఇట్టి విషయంలో పై అధికారులు పర్యవేక్షించి పేద ప్రజలకు న్యాయం చేయాలి లేనియెడల పెద్ద ఎత్తున న్యాయం జరిగే వరకు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు ,పున్న వెంకటేష్ ,పున్న బిక్షమయ్య, భీమగోని శివగౌడ్ , పెరికేటి శ్రీనివాసాచారి, చిన్న గోని శ్రీనివాస్ గౌడ్, శివ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వల ప్రాజెక్ట్ మరమ్మత్తులపై జాగృతి ధర్నా




**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూర్, హుజురాబాద్ నియోజకవర్గాల రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడే కల్వల ప్రాజెక్ట్ మత్తడి కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ప్రభుత్వం మరమ్మత్తులు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా ముట్టడి చేపట్టారు.ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, “ప్రభుత్వానికి రైతుల సమస్యలపై చిత్తశుద్ధి లేదు. కల్వల ప్రాజెక్ట్ మరమ్మత్తులు చేయకపోవడం రైతు వ్యతిరేక విధానానికి నిదర్శనం. గతంలో జాగృతి అధ్యక్షురాలు కవితక్క ఈ ప్రాజెక్టును సందర్శించి మరమ్మత్తులు చేయాలని ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. స్థానిక ఎమ్మెల్యేలు రైతుల సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ ప్రయోజనాలకే పరిమితమవుతున్నారు అని విమర్శించారు.అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న ఈ సమయంలో రైతుల పట్ల నిజమైన ప్రేమ ఉంటే కల్వల ప్రాజెక్ట్ మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ మరమ్మత్తులు జరిగే వరకు జాగృతి పోరాటం ఆగదు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఇరిగేషన్ శాఖ మంత్రి ఇల్లు, రాష్ట్ర ఇరిగేషన్ కార్యాలయాన్ని రైతులతో కలిసి ముట్టడిస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల జాగృతి నాయకులు బుడిగె పర్శారం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, బిసి విభాగం అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, వారాల శ్రీనివాస్, గాలిపల్లి రత్నాకర్ చారి, బసవేణి రాజేందర్, గాడిచర్ల కొమరయ్య, ఉల్లేందుల నరేష్, అలిశెట్టి అజేయ్, గర్శకుర్తి విద్యాసాగర్, గుంజపడుగు వవన్ కుమార్, పుసాల పవన్, మహిళా నాయకురాలు యం.డి. సల్మ, బశెట్టి కృష్ణవేణి, జంగ అపర్ణ, పుల్లరి అంజలి, రోజా రెడ్డి, పోన్నం శిరీష, ఐలా ప్రసన్న, హరిష్, ఓర్గల శేఖర్, మేస మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయానికి సీలింగ్ ఫ్యాన్ల అందజేత

**పాలకుర్తి, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండలం ఈసాల తక్కళ్ళపల్లి గ్రామంలోని శివాలయానికి గ్రామానికి చెందిన 10వ, 12వ వార్డు సభ్యులు సంకరి కుమార్, గన్నేవరపు పద్మ శంకర్ తమ స్వంత ఖర్చుతో సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. గ్రామంలో హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు రాత్రి వేళల్లో దోమలతో తీవ్ర ఇబ్బందులు



పడుతున్న విషయం తెలుసుకుని వార్డు సభ్యులు ఈ ఫ్యాన్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా హనుమాన్ దీక్ష పరులు వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నల్లగొండ పట్టణ కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా దావతే ఇఫ్తార్

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి శరత్ చంద్ర శేఖర్ మరియు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నల్లగొండ ,మార్చి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంజాన్ మాస ఉపవాసంలో పురస్కరించుకొని నల్లగొండ పట్టణ కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దావత్ ఇస్తారు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రంజాన్ పవిత్రత మనసులను కలిపే శక్తి అని కలెక్టర్ తెలిపారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి పేదవారికీ చేరే విధంగా ఏర్పాట్లు చేశామని జిల్లా ప్రజలంతా సుఖశాంతులతో రంజాన్ పండుగ నిర్వహించుకోవాలని తెలిపారు..

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ:** ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న



వారికి పోలీస్ శాఖ తరపున దావతే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల కోసం అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు యువత తప్పుదారులు పడకుండా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున రంజాన్ శుభాకాంక్షలు తెలిపారుఅనంతరం అతిధులను ముస్లిం మత గురువులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ హఫీస్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ డిఎస్పి కే శివరాం రెడ్డి, దేవరకొండ డి.ఎస్.పి శ్రీనివాసరావు, మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, సీఐలు, ఎస్సైలు, నల్గొండ డిప్యూటీ మేయర్ ఆమెర్ ,నల్లగొండ కార్పొరేటర్లు, పట్టణ పుర ప్రముఖులు ముస్లిం మత గురువులు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి కృషి చేస్తానన్న మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి హైదరాబాద్ నగరంలో క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ అంశాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ అనుమతి తీసుకొచ్చేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి వివాదాలు లేని అనుకూల ప్రదేశాన్ని గుర్తించి క్రిస్టియన్ భవన్ నిర్మాణం చేపట్టేలా ప్రయత్నాలు చేస్తానని అన్నారు.మెట్టుగూడలో గ్లోబల్ క్రిస్టియన్ లా బోర్డ్ కార్యాలయాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ బోర్డ్ సమర్థవంతంగా పని చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పేద మరియు అవసరమైన క్రైస్తవులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ బోర్డ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా క్రైస్తవ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# కంటి ఆసుపత్రిని సందర్శించిన ఐడిబిఐ ఆఫీసర్



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఐడిబిఐ బ్యాంకు కార్పొరేట్ ఆఫీస్ ముంబై నుండి వచ్చిన ఆఫీసర్ మొహమ్మద్ అన్వర్ హుస్సేన్ సిఎస్ఆర్ మేనేజర్ రేకుర్తి కంటి ఆసుపత్రిని సందర్శించారు.సిఎస్ఆర్ గ్రాంట్ ద్వారా బ్యాంకు డొనేట్ చేసిన 74,08,700 వినియోగ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తామని, వైద్య మరియు విద్య రంగాల్లో సిఎస్ఆర్ గ్రాంట్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, ట్రస్టు సభ్యుడు కోల అన్నా రెడ్డి పాల్గొన్నారు.

# విజయవంతంగా ఆశ వర్కర్ల 48 గంటల ధర్నా

**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు 48 గంటల నిరవధిక ధర్నా, వంటావార్పు, సామూహిక భోజనాలు విజయవంతంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఫిక్స్డ్ వేతనం రూ.18,000 నిర్ణయం తీసుకోవాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం సరిపడా నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.రాత్రి టెంట్ కింద పడుకుని అనేక ఇబ్బందులు భరించిన ఆశ వర్కర్లకు సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, ఏఐఎఫ్బీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు, ఎయిరత్వఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మద్దతు తెలిపారు.సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, "ఆశ వర్కర్ల జీతాలు పెంచమంటే ఖజానా ఖాళీ అంటున్నారు. కానీ మీ జీతాలు, అలవెన్సులు లక్షల్లో తీసుకోవడం ప్రజా పాలన ఎలా అవుతుంది?" అని ప్రశ్నించారు. వైద్యరంగానికి 10% బడ్జెట్ కేటాయించాలని, ఆశ వర్కర్లకు హామీ



ఇచ్చిన వేతనం, ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత మాట్లాడుతూ, మా జీతం పెరగకపోయినా పనులు మాత్రం రోజురోజుకీ పెరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ హామీ వల్లే మేము ఎండల్లో, చీకట్లో రెండు రోజుల పాటు వంటావార్పు, సామూహిక భోజనాలు చేస్తున్నాం అని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయకపోతే మంత్రి ఇల్లు ముట్టడి, చలో అసెంబ్లీ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఆశ వర్కర్ల పెండింగ్ పారితోషికాలు, పీఆర్సీ ఏరియర్స్, లేప్రసి సర్వే, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీ తదితర బకాయిలను తక్షణమే చెల్లించాలని, భవిష్యత్తులో పారితోషికాలు సకాలంలో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాల్వ సారిక, ఉపాధ్యక్షులు పద్మ, రజిత, సరిత, లత, సహాయ కార్యదర్శులు సుమలత, శ్యామల, సరోజన, లావణ్య, సుమతో పాటు సుమారు 300 మంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాల్లో మేయర్ మహంకాళి స్వామి



**రామగుండం, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ మేడిపల్లి గ్రామంలో మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మేడిపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు. గౌడ కుటుంబాలు కలిసి మొక్కలు చెల్లించి, కొబ్బరికాయ కొట్టి ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ, గౌడ కుటుంబాలకు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆరాధ్య దైవం. గుడి నిర్మాణం అభినందనీయమైన విషయం. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు రామగుండం ప్రజలపై ఉండాలని, గుడి నిర్మాణానికి మా వంతు సహకారం అందిస్తాం అని తెలిపారు. గౌడ కుటుంబ సభ్యులందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్, గడ్డం శ్రీనివాస్, ముస్తఫా, బొడిగ ప్రియా భరత్ గౌడ్, మేరుగు భూలక్ష్మి, లింగమూర్తి, దూళికట్ట సతీష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుర్రాల మల్లేష్ యాదవ్, మేరుగు అభిషేక్, గౌడ సంఘం సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు కుట్టు మిషన్ల పంపిణీ

**కరీంనగర్ రూరల్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా శిక్షణ పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.నగునూరులో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లబ్ధిదారులకు రూ.15,000 విలువైన కుట్టు మిషన్లు అందజేశారు. మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది లబ్ధి




పొందుతున్నారని తెలిపారు. 18 రకాల కులవృత్తులకు శిక్షణ, సర్టిఫికెట్, రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం, టూల్ కిట్స్ అందిస్తున్నారని వివరించారు. కులవృత్తుల ప్రోత్సాహం కోసం విశ్వకర్మ యోజన ఎంతో దోహదం చేస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీ, కరీంనగర్‌లో పథకం అమలు కోసం కృషి చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాడ వెంకటరెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, కొమురయ్య, సర్పంచ్ సాయిల్ల శ్రావణి, కొత్తకొండ దీపక్ తేజ, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు అఫ్రోజ్, బూత్ అధ్యక్షులు ఆవుల రాజు, వరి అజయ్, సాయిల్ల వినయ్, దావు సంతోష్, మోహన్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, శ్రీనివాస్, హరీష్, వెంకటేష్, సచిన్ సంజయ్, వేణు, మదన్, కుమార్, గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# కన్నాల జామే మసీదు నూతన కార్యవర్గం

**పాలకుర్తి, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలోని జామే మసీదు నూతన కార్యవర్గాన్ని మసీదు ప్రాంగణంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా సయ్యద్ చాంద్ పాషా, ఉపాధ్యక్షునిగా మీర్జా సాజిద్ బేగ్, కోశాధికారులుగా తాజోద్దీన్, షేక్ తౌఫిక్ పాషా ఎన్నికయ్యారు. అదనంగా తొమ్మిది మంది సభ్యులను సలహాదారులుగా ఎన్నుకున్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మా మీద నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు. మసీదు అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాం అని హామీ ఇచ్చారు.ముస్లిం మత పెద్దలు కొత్త కమిటీని శాలువాతో ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రేమ జ్యోతికి ఘన స్వాగతం



**హుస్నాబాద్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భగవాన్ సత్యసాయి బాబా వారి ప్రేమ జ్యోతి పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ప్రారంభమై, తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటిస్తూ మంగళవారం మధ్యాహ్నం సిద్దిపేట జిల్లా బెజ్జంకి ద్వారా హుస్నాబాద్ పట్టణానికి చేరుకుంది. గాంధీ చౌరస్తా వద్ద భక్తులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికి, అనంతరం సత్యసాయి మందిరానికి తీసుకెళ్లి భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా మహిళా కన్వీనర్ యమునారాణి మాట్లాడుతూ, పుట్టపర్తికి వెళ్లి స్వామివారిని దర్శించలేని వారికి స్వామి అనుగ్రహం అందించాలనే ఉద్దేశంతో ప్రేమ జ్యోతి ప్రారంభమైంది. హుస్నాబాద్‌కు రావడం భక్తులందరికీ అదృష్టం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని 75 దేశాల ప్రజలు స్వామి సేవలో నిత్యం ఆయన నామాన్ని జపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సిద్దిపేట జిల్లా కన్వీనర్ నరసింహులు, సేవాదళ్ కోఆర్డినేటర్ వీర భాస్కర్, హుస్నాబాద్ సమితి కన్వీనర్ కొత్తపల్లి రవీందర్, మాజీ కన్వీనర్ దొడ్డి శ్రీనివాస్, సుధాకర్ రావు, మురికి సంధ్యావలి, కాపర్తి జయ, శ్యామల, అంతయ్య, దొడ్డి లక్ష్మి, పుదారి లక్ష్మి, కొత్తపల్లి స్వరూప, జ్యోతి, మాశెట్టి స్వరూప రాణి, కైలాసం, నాగరాణి, మాధవి, రొడ్డ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక సందర్శన



**సిద్దిపేట, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ప్రిన్సిపల్ వివరాల ప్రకారం, ఒంటిపూట బడి కారణంగా విద్యార్థులు ఉదయం 7.30కి ఏమి తినకుండా వస్తున్నారని, 10.30 సమయంలో అన్నం, కూర, సాంబారు భోజనం అందిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ 10వ తరగతి గదిలోకి వెళ్లి రేపు జరగనున్న హిందీ పరీక్షకు విద్యార్థులు క్షుప్తంగా చదివి అర్థం చేసుకుని రాయాలని సూచించారు. 9వ తరగతి విద్యార్థులను అడిగి ఉదయం ఏం తిన్నారని, వార్షిక పరీక్షలు ఎప్పటి నుండి ప్రారంభమవుతాయని ఆరా తీశారు. విద్యార్థులు సాంబారు తో అన్నం తిన్నాం, ఏప్రిల్ 10 నుండి పరీక్షలు ప్రారంభమవుతాయి అని తెలిపారు. అయితే భోజనం విషయంలో ప్రిన్సిపల్ చెప్పిన వివరాలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నం, సాంబారు మాత్రమే పెట్టి కూర కూడా పెట్టామని చెప్పడం అబద్ధం. ఇలాంటి ఇష్టానుసారపు వ్యవహారాలు సహించేది లేదు. మళ్లీ పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికల తుది జాబితా విడుదల




**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ బార్ అసోసియేషన్ 2026--2027 సంవత్సరానికి ఈ నెల 26న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల అధికారి ముత్తోజు రామకృష్ణ చారి మంగళవారం ప్రకటించారు. అధ్యక్ష పదవికి కొండల్ రెడ్డి ఈ, లక్ష్మన్ జి, సజన్ కుమార్ పి, ఉపాధ్యక్ష (జనరల్) పదవికి భూం రెడ్డి యస్, శ్రీధర్ రావు యస్, శివకుమార్ బి, సయ్యద్ సాబిర్, ఉపాధ్యక్ష (మహిళ) పదవికి గీతా రాణి జే, తిరుమల దేవి యం పోటీ చేస్తున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి అరుణ్ కుమార్ కె, చంద్ర మౌళి కె, కిరణ్ కుమార్ సి హెచ్, తిరుపతి కె, జాయింట్ సెక్రటరీ (జనరల్) పదవికి దేవ కిషన్ యస్, శ్రీనివాస్ పి, కోశాధికారి పదవికి మల్లా రెడ్డి యమ్, ప్రభాకర్ యస్, రవీందర్ యం, శ్రీధర్ కె, స్వామి బి, లైబ్రరీ సెక్రటరీ పదవికి మొహ్మద్ కబీరుద్దీన్, మునీష్ యు, రాజేశ్ బి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి హరీశ్ కుమార్ కె, శ్రీకాంత్ బి పోటీ చేస్తున్నారు. సీనియర్ ఈసి సభ్యులుగా 30 ఏళ్ల సీనియారిటీకి మదన్ బాబు యం, ప్రభాకర్ రావు పి, 20 ఏళ్ల సీనియారిటీకి ఇద్దరు, 10 ఏళ్ల సీనియారిటీ మహిళా విభాగానికి ఇద్దరు, జూనియర్ ఈసి (జనరల్) విభాగానికి ఎనిమిది మంది, జూనియర్ ఈసి (మహిళ) విభాగానికి ఐదుగురు పోటీ చేస్తున్నారు. జాయింట్ సెక్రటరీ (మహిళ) పదవికి అనురాధ యం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

## శిశుగృహం నుండి పిల్లల దత్తత



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ శిశుగృహంలో పెరుగుతున్న చిన్నారులను దత్తత తీసుకున్న దంపతులకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఉత్తర్వులు అందజేశారు. సిద్దిపేటకు చెందిన ఒక దంపతులు ఒక శిశువును, తమిళనాడుకు చెందిన ఇద్దరు దంపతులు మరో ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో వీరికి అధికారికంగా దత్తత ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలి. రక్త సంబంధీకుల నుండి దత్తత కోరుకునేవారు, బాలసదనాలు లేదా శిశుగృహాల నుండి దత్తత కోరుకునేవారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దుర్దాన పర్వీన్, శిశుగృహ మేనేజర్ అపూర్వ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీల అమలులో వైఫల్యంపై బీజేపీ నిరసనలు









**హుస్నాబాద్/ శంకరపట్నం/ఎల్కతుర్తి/మార్చి 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు పలు మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎల్కతుర్తి మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి వృద్ధాప్య--వితంతు--వికలాంగులకు కొత్త పెన్షన్లు, రైతులకు ఎకరాకు రూ.6,000 పెట్టుబడి సాయం వంటి హామీలను విస్మరిస్తోంది. రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని విమర్శించారు. హుస్నాబాద్ మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. నేతలు మాట్లాడుతూ, జాబ్ క్యాలెండర్, ఆసరా పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్నారు అని పేర్కొన్నారు. మానకొండూర్ మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఎమ్మార్వో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. 6 గ్యారంటీలు -- 420 హామీలు వెంటనే అమలు చేయాలి అని నినాదాలు చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది" అని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించారు. శంకరపట్నం మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. "మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500, వృద్ధులకు పెన్షన్లు, యువతులకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం వంటి పథకాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. రైతు భరోసా ఇప్పటికీ అందలేదు అని ఎద్దేవా చేశారు. ఈ నిరసనల్లో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాధకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

### కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, మాధకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత. సమిష్టి కృషితో కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం అని అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాన్షియస్‌నెస్ క్లబ్బులు చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల ప్రగతి ప్రణాళికలో డ్రగ్స్ నిర్మూలన ఒక ముఖ్య అంశమని, అందుకు తగిన రీతిలో కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, జిల్లాలో యాంటీ డ్రగ్ కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయని, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా రవాణా ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు జరుగుతున్నాయని, నిషేధిత ఇంజక్షన్లు, టాబ్లెట్లు వినియోగించినా లేదా సరఫరా చేసినా కఠిన క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత రెండు నెలల్లో జిల్లాలో డ్రగ్స్ సంబంధిత 3 కేసులు నమోదు కాగా, 6 మందిని అరెస్టు చేసి 578 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై కలెక్టర్ దృష్టి



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ,ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే రోడ్డు భద్రత సాధ్యమవుతుంది అని అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారుల మరమ్మత్తులు, డ్రైనేజీ పనులు జరుగుతున్న చోట్ల వాహనదారులు గుర్తించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలం జరిగే పనుల వద్ద ప్రమాద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రమాదాల్లో బాధితులకు తక్షణ వైద్య సాయం అందేలా ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు.ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో అరైవ్-అలైవ్ పేరుతో రోడ్డు భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రమాదకర మలుపులు, సిగ్నలింగ్, లైటింగ్ వ్యవస్థలపై దృష్టి సారించాలని, విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, జిల్లాలో 24 ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రోడ్డు వైపు పెరిగిన కొమ్మలు తొలగించడం, జంక్షన్లలో సిగ్నలింగ్, బ్లికింగ్ బల్బులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. జగిత్యాల రోడ్డుకు ఇరు వైపులా పొదలు తొలగించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఆర్టిఏ కమిటీ మెంబర్ పడాల రాహుల్, రోడ్లు--భవనాల శాఖ ఈఈ నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ పాఠశాలల్లో జిల్లా స్థాయి ఎం.యు.ఎన్ స్పెల్ బీ కార్యక్రమాలు




**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పీఎం శ్రీ పాఠశాలలకు సంబంధించిన జిల్లా స్థాయి మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎం.యు.ఎన్) మరియు స్పెల్ బీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో 22 పాఠశాలల నుండి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎం.యు.ఎన్ పోటీల్లో 11 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో ఎంపికై, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. స్పెల్ బీ పోటీల్లో 36 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 10 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, డిసిఇబి కార్యదర్శి భగవంతయ్య, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి హాజరయ్యారు. ఎం.యు.ఎన్ న్యాయనిర్ణేతలుగా బి. తిరుపతి, ఏ. కుమారస్వామి, ఆర్. పవన్ కుమార్ వ్యవహరించగా, స్పెల్ బీ పోటీలకు వినాయధర్ రాజు, శివకుమార్, మంజుర్ అలీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**హుస్నాబాద్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రైతుల సౌకర్యార్థం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులు పండించిన పంట అమ్మకానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని సూచించారు.మొక్కజొన్న కొనుగోలు అంశంపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ మరియు సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో చర్చించగా, వెంటనే స్పందించి హుస్నాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లకు అనుమతి ఇచ్చారని తెలిపారు.మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మీలు, బొలిశెట్టి శివయ్య తదితర ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మరియు మార్క్‌ఫెడ్ అధికారులు కలిసి కొనుగోళ్లను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా త్వరలోనే పూర్తిస్థాయిలో మొక్కజొన్న కొనుగోళ్లు చేపడతామని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

## ప్రారంభంకానున్న చైత్ర మాస వసంత నవరాత్రోత్సవాలు



**కరీంనగర్ రూరల్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగునూర్‌లోని శ్రీ దుర్గాభవానీ ఆలయంలో ఈ నెల 19 నుండి 28 వరకు చైత్ర మాస వసంత నవరాత్రోత్సవాలు జరుగుతాయని ఆలయ ఫౌండర్, చైర్మన్ వంగల లక్ష్మన్ తెలిపారు.ఉత్సవాల ప్రారంభానికి ముందు 18వ తేదీ బుధవారం ఉదయం 6 గంటలకు ఫలపంచామృతాభిషేకం, మహా హారతి, ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 19వ తేదీ గురువారం ఉదయం పుణ్యాహవాచనం, కలశ స్థాపన జరుగుతాయి. ఉగాది పండుగ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ, విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయి. సాయంత్రం 5 గంటలకు ఉగాది పంచాంగ శ్రవణం జరుగుతుంది. నవరాత్రుల్లో ప్రతిరోజూ ఉదయం 8.30కి, సాయంత్రం 7 గంటలకు విశేష హారతులు, పూజలు జరుగుతాయి. 28వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు చండీహోమం, మధ్యాహ్నం మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు.

## ప్లాస్టిక్ వాడకంపై అవగాహన సదస్సు




**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రామగుండం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్పై అవగాహన కార్యక్రమం కరీంనగర్‌లోని మానేరు కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ బి. భిక్షపతి పాల్గొని, ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి, నీరు, జీవవ్యవస్థలకు కలిగే హానికారక ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి పాటించాల్సిన నియమాలు, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తిరుపతి రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ బి. భిక్షపతి, కార్యాలయ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ నేతల హోర్డింగ్లుపై సిపిఐ ఆగ్రహం



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగర ముఖద్వారాలకు బీజేపీ నేతలు మున్సిపల్ అనుమతులు లేకుండా హోర్డింగ్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, ప్రజలకు నిబంధనలు చెప్పాల్సిన నేతలే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. సభ ముగిసి మూడు రోజులు గడిచినా ఇప్పటికీ హోర్డింగ్లు, ఫ్లెక్సీలు తొలగించకపోవడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని చూపిస్తోంది అని విమర్శించారు. కరీంనగర్ నగరానికి ప్రతిరోజు వేలాది మంది ప్రజలు వస్తారని, ముఖద్వారాల వద్ద బీజేపీ నేతల ముఖాలు కనబడటం నగర ఖ్యాతిని దెబ్బతీస్తోందని ఆయన అన్నారు. గత పాలన కన్నా మా పాలనలో మార్పు చూపిస్తామని చెప్పిన బీజేపీ నేతలు అడ్డదారి తొక్కుతున్నారు అని ఎద్దేవా చేశారు.హోర్డింగ్లు, ఫ్లెక్సీలు వెంటనే తొలగించకపోతే మున్సిపల్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పైడిపల్లి రాజు హెచ్చరించారు.

## జనగణనపై పూర్తి అవగాహనతో ముందుకు సాగాలి



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జనగణన--2027 కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని మర్రి చిన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఈ నెల 15 నుండి చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ అధికారులు, జిల్లా అదనపు సెన్సెస్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన కోసం సూచించిన ఆప్ రిజిస్ట్రేషన్, పనితీరు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తే ఉన్నతాధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకొని పకడ్బందీగా సర్వే నిర్వహించాలి. టెక్నికల్ అంశాలు, నియమ నిబంధనలు స్పష్టంగా తెలుసుకొని నవీకరించిన మార్గదర్శకాలను పాటించాలి అని సూచించారు.మండల చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా నాయబ్ తహసిల్దార్లు, పట్టణ చార్జ్ అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, అదనపు చార్జ్ అధికారులుగా టౌన్ ప్లానింగ్ అధికారులు, జిల్లా అదనపు సెన్సెస్ అధికారులుగా పలువురు జిల్లా స్థాయి అధికారులు శిక్షణ పొందుతున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, సిపిఓ రామ్ దత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో నూతన పరిపాలన అధికారి



**కరీంనగర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖలో నూతన పరిపాలన అధికారిగా ఇల్లందుల రాజగోపాల్ బాధ్యతలు స్వీకరించారు.గత కొన్ని నెలలుగా పరిపాలన అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో శాఖ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొన్నారు. ప్రభుత్వం పరిపాలన అధికారి పోస్టులను భర్తీ చేయడంతో రాజగోపాల్ పదోన్నతిపై ఈ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉంటాను. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను అని తెలిపారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణతో పాటు ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజగోపాల్ జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని రైతు సంఘం డిమాండ్



**అచ్చంపేట, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశనాయక్ మాట్లాడుతూ, జనవరి నుండి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కూలీల అకౌంట్లలో జమ కాలేదు. ఉగాది పండుగ పూట కూలీలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడింది అని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు త్రాగునీరు, విశ్రాంతి కోసం టెంట్లు, అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స బాక్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టం కూలీలకు ఇబ్బందులు కలిగిస్తోందని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని కొనసాగించాలని కోరారు. పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తాం అని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సైదులు, వీరయ్య, శ్రీనివాస్, రవితో పాటు కూలీలు లక్ష్మి, తిరుపతమ్మ, వెంకటయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన



సేంద్రియ వ్యవసాయ కిట్లను అందజేస్తున్న ఏవో ఉమాపతి ఎలిగేడు సర్పంచ్ ప్రవీణ్

**ఎలిగేడు, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఉమాపతి ఈ సందర్భంగా మాట్లాడుతూ, "రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి. ఎరువు బుకింగ్ యాప్, సాయిల్ హెల్త్ కార్డు, డ్రోన్ వాడకం వంటి అంశాలను సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా పంటల దిగుబడి పెరుగుతుంది. సేంద్రియ వ్యవసాయం పర్యావరణానికి మేలు చేస్తుంది, రైతులకు స్థిరమైన ఆదాయం అందిస్తుంది" అని వివరించారు. అనంతరం రైతులకు సేంద్రియ వ్యవసాయ కిట్లు, సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఏఈఓ సురేష్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## రజకులపై దాడి అమానుషం

-- జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్



**ఎలిగేడు, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని బుర్హాన్ మియాపేట గ్రామంలో ఇటీవల రజకులపై జరిగిన దాడి అమానుషమని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "సర్పంచ్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వలేదనే కారణంతో గోదాల వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు, అనుచరులు రజక కులానికి చెందిన పరుశరాములపై చేసిన మూకుమ్మడి దాడి, రజక జాతిపై చేసిన దాడిగా పరిగణిస్తాం" అని పేర్కొన్నారు. గ్రామంలో పోచమ్మ బోనాల సందర్భంగా పరుశరాములు కుటుంబ సభ్యులతో కలిసి తన నివాసంలో భోజనం చేస్తున్న సమయంలోనే కర్రలతో దాడి చేసిన ఘటనపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. "రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కాలయాపన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా రజక కులస్తులు రోడ్లపైకి వచ్చి ఉద్యమం చేయాల్సి వస్తుంది" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో రజక సంఘం జిల్లా కార్యదర్శి గంగిపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు ముంజంపల్లి సాయిలు, ఆగయ్య, చంద్రయ్య, రాకేష్, రాజేష్, మల్లేష్, అనిల్, ఓదెలు, రమేష్, అలాగే వివిధ సంఘాల నాయకులు గోపు లక్ష్మారెడ్డి, గుజ్జుల మల్లారెడ్డి, రవీందర్‌రావు, మధుకర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో షబే ఖదర్ వేడుకలు



**ఆమనగల్లు, మార్చి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పట్టణ కేంద్రంలోని జామ మసీద్, మహమ్మదీయ మసీద్, హమాదే హీలాల్ మసీద్ లలో సోమవారం రాత్రి షబే ఖదర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మౌలానా వహీద్, అతీఫ్ లు ధార్మిక సందేశం ఇచ్చారు. రంజాన్ నెలలోనే పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిందన్నారు. ఖురాన్ ను నిరంతరం పఠించాలని కోరారు. రంజాన్ స్ఫూర్తితో నిరుపేదలకు సేవలు చేయాలని కోరారు. అనంతరం ఆయా మసీద్ కమిటీ సభ్యులు రంజాన్ మాసంలో పూర్తి ఖురాన్ పఠించిన హాఫిజ్ సాబ్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీల అధ్యక్షులు మాసూమ్, గౌస్, ఖాదర్ ఖాద్రి, మైనారిటీ నాయకులు సయ్యద్ ఖలీల్, పాషా, జబ్బర్, రజాక్, మహబూబ్, నయూమ్, షరీఫ్, అలీమ్, ఫరూక్, మజీద్, అబ్బు, బాబా, అహ్మద్, అరీఫ్, హనీఫ్, రఫీ, ఖాదర్ తదితరులు ఉన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి




**ఆమనగల్లు, మార్చి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సందీప్, గౌతమ్ తెలిపారు. నూనే గింజ పంటలైన వేరుశనగ, ఆముదం, నువ్వులు, ఆయిల్ ఫామ్ పంటలను పెంచాలని సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ అధ్వర్యంలో వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సహజ వ్యవసాయం అన్నిరకాల పంటలో రైతులు అధికంగా రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. జనుము, జీలుగ, పిల్లి పెసర లేదా బహుధాన్యాల విత్తనాలను పంట పొలంలో వేసుకొని వాటిని పూత దశలో కలియదున్నాలన్నారు. గోమూత్రం, పేడ ద్వారా చేసే జీవామృతం తయారీ వివరించామన్నారు. యూరియా, నానో డీఏపీతో పాటు సూక్ష్మపోషకాలు జింకు ఇతర పోషకాలు పిచికారీ పంటలకు అందజేయడం అధిక దిగుబడులు వస్తాయన్నారు. 125 మంది రైతులను ఒక క్లస్టర్ లో ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బాలకృష్ణ, ప్రభావతి మరియు రైతులు పాల్గొన్నారు.

## పెద్దపులి నాగారం గ్రామంలో నీటి సమస్య పరిష్కారం



**మహేశ్వరం, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామం 8వ వార్డులో చాలా రోజులుగా కొనసాగుతున్న నీటి సమస్యను నూతన పాలకవర్గం పరిష్కరించింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బుధవారం గ్రామ సర్పంచ్ బండారి లింగం చేతుల మీదుగా కొత్త బోరు ప్రారంభించారు. ఈ సందర్భంగా 8వ వార్డు సభ్యురాలు రాణమ్మ కుమారుడు బూరుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ, "గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ల సహకారంతో బోరు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఇది మా పాలకవర్గం ఇచ్చిన మాటకు నిలువెత్తు నిదర్శనం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు పీఏసీసీ చైర్మన్ మంచే పాండు యాదవ్, వార్డు మెంబర్లు కోర్ర రవి, కృపానందం, శరత్‌రెడ్డి, తోట్ల నరసింహ, బాలరాజ్, గ్రామ ప్రజలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 20న మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు




**ఎలిగేడు, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలను ఈ నెల 20న ఎలిగేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎలిగేడు మండల విద్యాధికారి ఏ. నరేంద్ర చారి తెలిపారు. ఈ పోటీల నిర్వహణపై మంగళవారం ఎలిగేడు ఎంఆర్సీలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మూడవ తరగతి చదువుతూ, 2017 సెప్టెంబర్ 1 నుండి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. అభ్యర్థులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకుని తగిన ధ్రువపత్రాలతో ఈ నెల 20న ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేయాలి" అని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మార్చి 28 నుండి ఏప్రిల్ 1 వరకు పెద్దపల్లి జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె. ప్రణయ్, ఎల్. శ్రీనివాస్, వి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం



**ఆమనగల్లు, మార్చి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 12 వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ నాగిళ్ళ జగన్ మంగళవారం స్థానికులతో కలిసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వీధుల్లో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వార్డు అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పల్లె కిషోర్, పల్లె యాదగిరి, నాగిళ్ళ శేఖర్, గంగిశెట్టి రమేష్, ఎండి ముజహీద్, పల్లె బన్నీ తదితరులు ఉన్నారు.

## నేటి ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


ఎలిగేడు ఉప సర్పంచ్ నరేష్

**ఎలిగేడు, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎలిగేడు ఉప సర్పంచ్ ముంజం నరేష్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "స్త్రీలు, పిల్లల వైద్య నిపుణులు, కంటి, పంటి, ఎముకల వైద్య నిపుణులు, సాధారణ వైద్య సేవలు ఈ శిబిరంలో అందుబాటులో ఉంటాయి. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి" అని కోరారు.

### పల్లెలు పరిశుభ్రంగా ఉంటేనే గ్రామం బాగుంటుంది

-- సర్పంచ్ జయమ్మ కృష్ణయ్య



**మహేశ్వరం, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పోరండ్ల గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా పల్లె ప్రకృతి వనంలో చెత్తను పూర్తిగా శుభ్రం చేసినట్లు గ్రామ సర్పంచ్ జయమ్మ కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుంది. పరిశుభ్రతతోనే ఆరోగ్యం, సౌకర్యం, సంతోషం లభిస్తాయి. అందుకే ప్రతి గ్రామస్థుడు పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలి" అని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు సర్పంచ్ జయమ్మ కృష్ణయ్య వెల్లడించారు.

## నందుపల్లి గ్రామంలో డ్వాక్రా భవనానికి భూమి పూజ




**మహేశ్వరం, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని నందుపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళా భవనానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ మాట్లాడుతూ, "గ్రామంలో డ్వాక్రా మహిళలకు ప్రత్యేక భవనం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల సమయంలో గెలిచిన వెంటనే ఈ భవనాన్ని నిర్మిస్తానని గ్రామస్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం" అని పేర్కొన్నారు. ఎంజైరేగ్స్ ఫండ్ ఆధ్వర్యంలో మహేశ్వరం ఎంపీడీవో శైలజా రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం ఏఈ రాంప్రసాద్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్‌కుమార్ చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ షేక్ ఎజాస్, కల్వకోల్ మహేందర్, దేశపాగ రమేష్, పంచాయతీ కార్యదర్శి జానయ్య, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

## కల్లు తాగి పైసలు ఇవ్వలేదని పోలుకు కట్టేసేన గీత కార్మికుడు



**జైపూర్, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కుందారం గ్రామంలో ఓ వ్యక్తిని పోలుకి కట్టేసిన ఘటన చోటుచేసుకుంది. కుందారం గ్రామానికి చెందిన ఎర్ర చంద్రయ్య అనే వ్యక్తి అనాథ అక్కడక్కడ పనులు చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్నాడు. మంగళవారం కల్లు డబ్బులు చెల్లించలేదనే కారణంతో ఎర్ర చంద్రయ్య అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన గీత కార్మికుడైన మల్లాగౌడ్ లాక్కెల్లి పోల్ కి కట్టేసిన ఘటన చోటు చేసుకుంది. గతంలో చంద్రయ్య అనే వ్యక్తితో మల్లా గౌడ్ పనులు చేయించుకొని బదులు కల్లు పోసేవాడని గ్రామస్తులు తెలిపారు. పైసలు ఇవ్వలేదని కారణంగా ఓ అనాథను కట్టేయడం దారుణమని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.

# ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

**- చైర్మెన్ పత్య నాయక్**



**ఆమనగల్లు, మార్చి 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఛైర్మెన్ పత్యనాయక్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎఫ్ఐడీసీ నిధులు 25 కోట్ల రూపాయలతో రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాల్స్, ఓపెన్ జిమ్ తదితర పనులు ఈ అభివృద్ధి కార్యక్రమాలలో భాగమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా సహకరించి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, కండె పాండు రంగయ్య, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు అవ్వారి శివలింగం, ఒగ్గు మహేష్, శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ అలీమ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, కాలే మల్లయ్య, రాగ్య నాయక్, దుడ్డు కృష్ణ యాదవ్, రఫీ, గుండ్రాతి కుమార్ గౌడ్, దేవరశెట్టి మహేష్, శ్రీను నాయక్, గుద్దేటి శివ, మహేష్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఘనంగా ఉగాది పురస్కారాల వేడుక

**రంగారెడ్డి, మార్చి 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్ వేదికగా 'శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కారాల' వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీ చండీ పరమేశ్వరి పీఠం దివ్య సౌజన్యంతో, జీఎంకే ఫౌండేషన్ మరియు ఆదిలీల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. శ్రీ చండీ పరమేశ్వరి పీఠాధిపతి, ప్రముఖ సిద్ధాంతి డాక్టర్ అవసరాల ప్రసాద్ శర్మ ఆశీస్సులతో ప్రారంభమైన ఈ వేడుకలో పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణప్రసాద్, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ పోతుల సునీత, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మరియు తెలంగాణ జాగృతి జిల్లా




అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి, జీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకులు జి. మణికంట, ఆదిలీల ఫౌండేషన్ చైర్మన్ ఆదినారాయణ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. సమాజ సేవ, ఆధ్యాత్మిక రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు, సేవారత్న, జ్యోతిష్య, ధార్మిక పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, "తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఉగాది పండుగను పురస్కరించుకుని సేవా దృక్పథం కలిగిన వ్యక్తులను గౌరవించడం అభినందనీయమైన విషయం" అని కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు, పురస్కార గ్రహీతలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను మరింత వైభవవంతం చేశారు.

# ఆమనగల్లులో లింగ నిర్ధారణ పరీక్షల కలకలం!




-విచారణ నిర్వహించిన వైద్యశాఖ అధికారులు
-ఎలాంటి అనుమతులు లేకుండా ఆస్పత్రి మరియు స్కానింగ్ సెంటర్ నడుపుతున్నట్లు నిర్ధారణ ?
- ఫార్మసీ అనుమతితో ఆసుపత్రి నిర్వహిస్తున్న నిర్వాహకులు








**ఆమనగల్లు, మార్చి 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణంలో అక్రమ వైద్య కార్యకలాపాలపై మరోసారి అనుమానాలు తలెత్తాయి. ఒక ఆసుపత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటన వైద్య నైతికతపై ప్రశ్నలు లేవనెత్తడమే కాకుండా, నియంత్రణ యంత్రాంగం పనితీరుపైనా సందేహాలు రేకెత్తిస్తోంది. జిల్లా వైద్యాధికారులకు ఒక బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే జిల్లా వైద్యశాఖ అధికారులు అప్రమత్తమై, ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సాయి ఆసుపత్రిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా డిప్యూటీ డీఎండహెచ్ఓ గీత ఇచ్చిన వివరాల ప్రకారం, సోమవారం రాత్రి తమ సిబ్బంది స్కానింగ్ సెంటర్‌ను మూసివేయించగా, మంగళవారం పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. విచారణలో ఆశ్చర్యకర విషయాలు బయటపడ్డాయి. సంబంధిత ఆసుపత్రికి అవసరమైన ఎలాంటి అధికారిక అనుమతులు లేకపోవడం నిర్ధారణ అయింది. అంతేకాకుండా, కేవలం ఫార్మసీ అనుమతితోనే ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇది వైద్య నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఒక మహిళ చికిత్స పొందుతున్నందున, తక్షణ సీజ్ చర్యలు తీసుకోలేదని అధికారులు వెల్లడించారు. అయితే ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తదుపరి చర్యలు త్వరలోనే తీసుకునే అవకాశముంది. ఈ ఘటన నేపథ్యంలో, అక్రమంగా నడుస్తున్న ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధమని తెలిసినా ఇలాంటి కార్యకలాపాలు కొనసాగడం ఆందోళనకరమని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వైద్య రంగంలో పారదర్శకత, బాధ్యత మరింత పెరగాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.